www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 20 నవంబర్ 2023

జనవరి 5 నుంచి రాజమండ్రిలో అంతర్జాతీయ తెలుగు మహాసభలు

ఏలూరు:వచ్చే జనవరి 5, 6, 7 తేదీల్లో రాజమండ్రిలో రెండో అంతర్జాతీయ తెలుగు మహా సభలు నిర్వహిస్తున్నట్లు మాస్టర్ గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఆంధ్ర సారస్వత పరిషత్ సంపం ఆధ్వర్యంలో జరిగే ఈ మహాసభ సన్నాహక సమావేశం డాక్టర్ మార్ని నాగశ్రీకాంత్ అధ్యక్షతన ఆదివారం ఏలూరులో జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాజరాజ నరేంద్రునికి, నన్నయ్యకు అంకితంగా రాజ మహేంద్రవరంలో తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. తెలుగు భాషను రాబోయే తరాల్లో తల్లి ఒడి భాషగా నిలిపే లక్ష్యంగా, ఆంధ్రమేవ జయతే అని ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పేందుకు ఈ ప్రపంచ తెలుగు మహా సభలు నిర్వహిస్తున్నామన్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ తెలుగు తల్లి పండుగగా జరిగే ఈ మహా సభల్లో కవులు, కళాకారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరూ పాల్గొనాలని కోరారు. బ్రిటన్ సిఐ కె.శివాజీ మాట్లాడుతూ తెలుగు మాతృ భాష కాదని, అమృత భాష అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగశ్రీకాంత్‌ను కన్వీనర్‌గా, నాగార్జ, పి.వెంకటేశ్వరరావు కో-కన్వీనర్లుగా, కస్తూరిరావు, టి.గిరిరాజ్, వై.ఆనందరావు, కె.శ్రీనివాసరావు, సి.హెచ్.సురేందర్ (పెన్నీ), రమణ, రామారావులు సభ్యులుగా ఎన్నుకున్నారు. వీరికి నియామకపత్రాలను అందజేశారు.

స్పందన 'కరువు'..!

- కరువు మండలాల ప్రకటనపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం
- జెడ్‌పి సర్వసభ్య సమావేశంలోనూ తీర్మానం చేయని పరిస్థితి
- ఎంపీ, స్థానిక ప్రజాప్రతినిధులు లేవనెత్తినా పట్టించుకోని దుస్థితి
- 12 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారుల నివేదికలు
- దెబ్బతిన్న పంటలకు పరిహారం రానట్టే..!
- కేవలం బీమా మాత్రమే వర్తిస్తుందంటున్న అధికారులు
- అగమ్యగోచరంగా రైతుల పరిస్థితి

చింతలపూడి మండలంలో వర్షాభావంతో ఎండిపోయిన చేతికొచ్చిన వరిపైరు (ఫైల్)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వర్షాభావ పరిస్థితులతో తీవ్ర దుర్భిక్షంగా మారిన కరువు మండలాల ప్రకటనలో ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది. ఆయా మండలాల గుర్తింపులో మొండిచెయ్యి అవలంభిస్తోంది. జిల్లా అధికారులు సైతం ఆదివిధంగా వ్యవహరిస్తుండటంతో పంటలు దెబ్బతిన్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. శనివారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనూ కరువు మండలాలపై తీర్మానం చేయకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ ఏడాది వర్షాకాలం నెలల్లో మూడు నెలలు లోటు వర్షపాతం నమోదైంది. తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో మెట్ట ప్రాంతంలో పలు మండలాల్లో తీవ్రదుర్భిక్షం నెలకొంది. చింతలపూడి, చాట్రాయి, కామవరపుకోట, బుట్టాయగూడెంతోపాటు పలు మండలాల్లో పెద్దఎత్తున పంటలు దెబ్బతిన్నాయి. అధికారుల లెక్కల ప్రకారం ఏడుమండలాల్లోని 51 గ్రామాల్లో 75శాతం మేర పంట దెబ్బతినిందని, 11 మండలాల్లోని 91 గ్రామాల్లో 8.065 ఎకరాల్లో పంట వడిలిపోయాయని తేల్చారు. దాదాపు 12వేల ఎకరాల్లో పైగా పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు నివేదికలు చెబుతున్నాయి. రైతులు ఎకరాకు రూ.20వేలకు పైగా పెట్టుబడులు పెట్టి నష్టపోయారు. వరి, పత్తి రైతుల పరిస్థితి దారుణంగా మారింది. కష్టకాలంలో ఆదుకోవాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసింది. కరువు మండలాల ప్రకటనలో జిల్లాలోని ఒక్క మండలానికి కూడా చోటు దక్కలేదు. జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎంఎల్‌ఎలు ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో తీవ్రంగా విఫలమైన పరిస్థితి నెలకొంది. పంటలు దెబ్బతినడంతో పశుగ్రాసం లేకుండా పోయింది. బోర్లవున్నా నీరు సరిగా రావడం లేదు. ఉపాధిలేక బతుకుతెరువు కష్టంగా మారింది. రైతులు కూలీలుగా మారుతున్నారు. అయినప్పటికీ కరువు మండలాల గుర్తింపులో ప్రభుత్వం మాత్రం తాముపట్టిన కుందేలుకు మూడేకాళ్లు అన్నట్లు వ్యవహరిస్తోంది. కరువు మండలాలుగా ప్రకటించకపోవడంతో రైతులకు అందాల్సిన ప్రభుత్వ సాయం పూర్తిగా అందకుండా పోనుంది. రబీ సాగుకు రైతులకు పెట్టుబడి సొమ్ములు దొరకడం లేదు. తమది రైతు ప్రభుత్వమంటూ గొప్పలు చెప్పడం తప్ప కష్టకాలంలో పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ తీరుతో రైతులకు ఏంచేయాలో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది.

పంట నష్టపరిహారం ఇవ్వనట్లే

వర్షాభావం దెబ్బకు పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటిస్తేనే పంట నష్టపరిహారం రైతులకు అందుతుంది. కానీ ప్రకటించలేదు. దీంతో రైతులకు పంట నష్టపరిహారం రానట్లేనని తేలిపోయింది. శనివారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌తోపాటు, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు దెబ్బతిన్న పంటలకు సంబంధించి పరిహారంపై అడిగారు. అధికారులు చెప్పిన ప్రకారం చూస్తే బీమా మాత్రమే వచ్చే అవకాశం ఉందని, పంట నష్టపరిహారం వచ్చే అవకాశం లేనట్లేనని చెప్పారు. తాము ప్రభుత్వానికి నివేదించామని చెప్పి ముగించారు. బీమా కూడా ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. కష్టముందు దెబ్బతిన్న పంట నష్టపరిహారం ఇవ్వకపోవడం ఏమిటో ఏ ఒక్కరికీ అర్థం కావడం లేదు. ఎంపీ, ఎంఎల్‌ఎలు, జిల్లా అధికారులు పరిశీలించి పంటలు దెబ్బతిన్నట్లు తేల్చినా కరువు మండలాలుగా ప్రకటించకపోవడం చూస్తే రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థంచేసుకోవచ్చు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ఏలూరు నగర సమగ్రాభివృద్ధే లక్ష్యం

నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జిల్లా కేంద్రంగా ఉన్న ఏలూరు శతాబ్దంన్నర క్రితమే పురపాలక సంఘంగా ఏర్పడింది. 2005లో నగరపాలక సంస్థగా అవతరించింది. నిన్న మొన్నటి వరకూ రాష్ట్రంలోనే అతిచిన్న నగరంగా ఉంది. ఇటీవల ఏడు పంచాయతీల విలీనంతో విస్తరణకు నోచుకుంది. అయితే మౌలికవసతుల పరంగా మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడిలానే ఉంది. రహదారులు, డ్రెయినేజీ, తాగునీరు వంటివి కల్పించడమే ఇక్కడ సవాలుగా మారింది. పారిశుధ్యం మెరుగుపర్చడం, మురుగునీటి పారుదల, రోడ్ల విస్తరణ, ఆక్రమణల తొలగియింపు వంటివి ఇక్కడ ప్రధాన్యతాంశాలు. గత ప్రభుత్వంలో ప్రతిపాదించిన స్మార్ట్ సిటీ లక్ష్యం ఆటకెక్కగా, ప్రస్తుతం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలపై దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో నగరపాలక సంస్థ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు, నిధుల లభ్యత తదితరాలను ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ 'ప్రజాశక్తి'తో నిర్వహించిన ముఖాముఖిలో వివరించారు.

ప్రశ్న : 150 ఏళ్ల చరిత్ర కలిగిన ఏలూరు అభివృద్ధికి ప్రణాళిక ఏమైనా ఉందా?

ఏలూరు నగర సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ముఖ్యంగా రెండు కోణాల్లో అభివద్ధి చేయాలని భావిస్తున్నాం. ఒకటి అందాల నగరి- అందరి బాధ్యత కాగా, పర్యావరణ పరిరక్షణ రెండోది. గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్ సిటీ పేరిట సీమెన్స్ కన్సార్టియంకు బాధ్యతలు అప్పగించి రూ.30 కోట్లు మంజూరు చేశారు. అదిప్పుడు అమల్లో లేదు. ప్రస్తుత ప్రభుత్వ ప్రధామ్యాలు మారాయి. దుమ్ములేని క్లీన్ రహదారులు, పచ్చని వనాలు ఏర్పాటు చేస్తున్నాం. ముఖ్యంగా జగనన్న నగర బాటలు, జగనన్న హరిత బాటలు, నగరవనాలకు ప్రాధాన్యతిస్తోంది.

ప్రశ్న : జగనన్న నగర బాటలో ఏయే పనులు చేపడుతున్నారు?

జగనన్న నగరబాటలో రోడ్లపై ఎక్కడా గుంతలు ఉండకూడదు. ఇప్పటికే రహదారుల మరమ్మతుల కోసం రూ.కోటి ఖర్చుపెట్టాము. మరో రూ.ఆరు కోట్లు రోడ్ల అభివృద్ధికి వెచ్చించాము. నగరంలో విస్తరించి ఉన్న ఆర్అండ్‌బి, పంచాయతీ రహదారులు మాత్రం ఆయాశాఖలే నిర్మించాలి.

ప్రశ్న : 'నగర వనం' ఏయే పనులు చేపట్టారు?

వెంకన్న చెరువును 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.50 కోట్లతో నగర వనంగా తీర్చిదిద్దబోతున్నాం. ఐదు మీటర్ల వరకూ గ్రీనరీ ఏర్పాటు చేస్తాము.

ప్రశ్న : ఏలూరు సుందరీకరణ కోసం ఎలాంటి పనులు చేపడుతున్నారు?

నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌కేప్)లో భాగంగా రూ.నాలుగు కోట్లతో ఆర్అండ్‌బి కార్యాలయం వద్ద వాటర్ వాల్ నిర్మించాం. సిఆర్ఆర్ కళాశాల వద్ద, మరో రెండు చోట్ల వాటర్ వాల్స్ నిర్మిస్తున్నాం. జన్మభూమి పార్క్-1,2 అభివృద్ధి చేస్తున్నాం. అగ్నిమాపక కూడలి నుంచి తమ్మిలేరు వంతెన వరకు రోడ్డు విస్తరణ, ఫుట్ పాత్, ఎస్ఆర్ స్టేడియం వద్ద ఫుట్ పాత్ నిర్మాణం, పచ్చదనం పెంపొందించడం జరుగుతుంది.

ప్రశ్న : నగరంలో చేపడుతున్న లైఫ్ ప్రోగ్రాం ప్రాముఖ్యత ఏంటి?

లైఫ్ అంటే లైఫ్ ఫర్ ఎన్విరాన్ మెంట్(పర్యావరణ జీవన శైలి). స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అమృత్ మహోత్సవంలో భాగంగా 75 కార్యక్రమాలు చేపట్టడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని కేంద్ర ప్రభుత్వం త్రిబుల్ ఆర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రెడ్యూస్ (తగ్గించడం), రీయూజ్ (పునర్వినియోగం), రీ సైకిల్(పునర్ సంవిధానం) లక్ష్యాలు. ఏలూరులోని అన్ని సచివాలయాల్లో త్రిబుల్ ఆర్ సెంటర్లు ఏర్పాటు చేశాం. త్వరలో నగరంలో త్రిబుల్ ఆర్ కియోస్క్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ఎవరైనా పునర్వినియోగ ప్లాస్టిక్ కియోస్క్‌లలో ఇస్తే కొంత మొత్తంగా వారికి డబ్బులు ఇవ్వడం జరుగుతుంది. ఇది ప్రయివేటువారి ఆధ్వర్యంలో జరుగుతుంది.

ప్రశ్న : నగరంలో భూగర్భ డ్రెయినేజీ పనులు ఎంత వరకు వచ్చాయి?

నగరంలో రూ.ఆరు కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులతో మరమ్మతులు చేపట్టాము. అమృత్ 2.0 పథకంలో భాగంగా రూ.112 కోట్లతో వన్ టౌన్‌లోని భూగర్భ డ్రెయినేజీ ఆధునికీకరణకి నిధులు మంజూరయ్యాయి.

ప్రశ్న : నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఏలూరులో పాత బస్టాండ్, అగ్నిమాపక కూడలి వద్ద రూ.ఎనిమిది లక్షలతో ట్రాఫిక్ సిగ్నల్స్ డిజిటలైజేషన్ చేశాం.

ప్రశ్న : ఏలూరులో జగన్న గృహాల నిర్మాణం ఎంత వరకు వచ్చింది?

ఏలూరులో కోమడవోలు, పోణంగి, చొదిమెళ్లలోని మూడు కాలనీల్లో 26 వేల గృహాలను నిర్మిస్తున్నాం. మౌలిక వసతులు కల్పిస్తున్నాం. 70 శాతం గృహాలు ప్రగతిలో ఉన్నాయి.

ప్రశ్న : రూ.361.55 కోట్లు అమృత్ నిధులతో ఏ పనులు చేపట్టబోతున్నారు?

ఏలూరు నగరంతో పాటుగా విలీన గ్రామాలు, జగనన్న కాలనీలో అభివృద్ధి పనుల కోసం రూ.361.55 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. విలీన గ్రామాల్లో నీటి సరఫరా కోసం రూ.129.20 కోట్లు, జగనన్న కాలనీలో నీటి సరఫరా కోసం రూ.23.79 కోట్లు, నగరంలో మురుగునీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు కోసం రూ.112.18 కోట్లు, జగనన్న కాలనీల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ కోసం రూ.87.98 కోట్లు, నీటి ట్యాంకుల పునర్వ్యవస్థీకరణ కోసం రూ.8.40 కోట్లు కలిపి మొత్తం రూ.361.55 కోట్లు నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధుల్లో కేంద్రం వాటా రూ.113.259 కోట్లు, రాష్ట్ర వాటా రూ.180.60 కోట్లు, ఆర్థిక సంఘం నిధులు రూ.30.90 కోట్లు, జనరల్ ఫండ్ నిధులు రూ.36.80 కోట్లు.

ప్రశ్న : నగరపాలక ఉద్యోగుల్లో అవినీతి నిరోధానికి, బాధ్యతాయుతమైన సేవలు పెంచడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

అవినీతి, సేవల్లో నిర్లక్ష్యాన్ని సహించేదిలేదు. తప్పక అలాంటివారిపై చర్యలు తీసుకుంటాము. పారిశుధ్య సిబ్బంది విషయంలో శ్రద్ధ తీసుకుంటున్నాము.

ప్రశ్న : డివిజనల్లో ఏమైనా అభివృద్ధి పనులు చేపడుతున్నారా?

ప్రతి డివిజన్‌లోనూ రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నాము. ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు ఇవ్వగా పనులు చేపట్టాము. త్వరలో మరో రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకూ అందుబాటులోకి రానున్నాయి. ఆ నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాము.

రంగ ప్రసాద్‌కు తెలుగు వెలుగు జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



రంగ ప్రసాద్

మండలంలోని గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామివారి ఆలయ ఆచార్యులు వేదాంతం వెంకట శేషరంగప్రసాద్ తెలుగు వెలుగు జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ సాంస్కృతిక సంగీత సాహిత్య నృత్య సమ్మేళనం-2023 సందర్భంగా రంగ ప్రసాద్‌కు ఈ పురస్కారం లభించింది. రంగ ప్రసాద్ జోతిష్యం, వాస్తు శాస్త్రాల్లో విశిష్టమైన కషి చేసినందుకు ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ పోలోజు రాజ్ కుమార్ ఆచార్యులు, జాతీయ కన్వీనర్లు డాక్టర్ రంగిశెట్టి రమేష్, డాక్టర్ వలబోజు మోహన్ రావు ఆదివారం విలేకరులకు తెలిపారు. పురస్కారాల ప్రదానోత్సవం వచ్చేనెల పదో తేదీన విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో జరిరుగుతుందన్నారు. రంగప్రసాద్ అవార్డుకు ఎంపికైన సందర్భంగా పలువురు ప్రముఖులు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు, అర్చకులు, వేద పండితులు, దేవస్థానం సిబ్బంది, పురోహితులు అభినందనలు తెలిపారు.

కోలాటం ప్రదర్శనలో మహిళలు

మద్దిలో ఆకట్టుకున్న సాంప్రదాయ నృత్యాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా కళాకారులు ఆదివారం ప్రదర్శించిన సాంప్రదాయ నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఆదివారం రాజమండ్రికి చెందిన శ్రీబాల రాజరాజేశ్వరి కూచిపూడి నృత్యాలయం వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన, వేణుగోపాల కోలాట భజన మండలి ఆచంట వారిచే కోలాట భజన కార్యక్రమం నిర్వహించారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.కొండలరావు తెలిపారు. అలాగే యాత్రికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించామన్నారు.

రోడ్లను అభివృద్ధి చేయాలని వినూత్న నిరసన

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు మండలంలో..

'జగనన్న ఈ రోడ్ల దుస్థితి ఏంటన్న.. నువ్వు అధికారంలోకి వచ్చాక రోడ్ ట్యాక్స్ పేరుతో లీటర్ ఇంధనానికి రూపాయి అదనంగా వసూలు చేస్తున్నావు.. నాలుగున్నరేళ్లు అయినా రోడ్లను అభివృద్ధి చేయాలని అనిపించడం లేదా' అంటూ టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు విమర్శించారు. ఆదివారం మండలంలోని కొర్లకుంట గ్రామం నుండి నేలపాటి వారి గుంట మీదగా కాట్రేనిపాడు వయా గోపవరం వరకూ టిడిపి నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. గుంతల రోడ్డుపై పొర్లు దండాలు పెడుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలుగుదేశం - జనసేన పార్టీల ఆధ్వర్యంలో గుంతల ఆంధ్రాకు దారేది నిరసన కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ముద్దరబోయిన మాట్లాడుతూ 'ఈ రోడ్లపై వాహనాలు నడిపితే ఇదిగో ఇలా పొర్లు దండాలు పెట్టాల్సిందే జగనన్న.. రూ.40 కోట్లు మంజూరు చేసిన నీ ప్రభుత్వంపై నమ్మకం లేక కాంట్రాక్టర్లు రోడ్లు వేసేందుకు భయపడుతున్నారు' అంటూ విమర్శించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బర్మా ఫణిబాబు, టిడిపి నాయకులు నూతక్కి వేణు, తెలుగు రైతు అధ్యక్షులు జగ్గవరపు వెంకటరెడ్డి, ముసునూరు మండల ప్రధాన కార్యదర్శి కందుల పిచ్చయ్య, తెలుగు యువత కార్యనిర్వహణ రాష్ట్ర కార్యదర్శి గద్దె రఘుబాబు, టిడిపి మండల అధ్యక్షులు ముసునూరు రాజా, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు గుడపాటి అజయ్ కుమార్, కొల్లి గంగారాం, మాజీ ఎంపిపి మసిముక్కు సుబ్బారావు, సర్పంచి గద్దల మోహన్ సుహాసిని, ఎంపిటిసి సూర్యదేవర నాగ మంజుల శ్రీనివాసరావు, రాపర్ల ప్రతాప్, రాపర్ల బాలకృష్ణ పాల్గొన్నారు.

కలిదిండి : మండలంలోని మూలలంక - పెదలంక ఆర్అండ్‌బి రహదారి గోతుల మయంగా మారిందని, తక్షణం అభివృద్ధి చేయాలని కోరుతూ టిడిపి, జనసేన నేతలు ఆందోళన చేపట్టారు. పార్టీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నంబూరి వెంకటరామరాజు, ఆంద్రాజు శ్రీనివాసరావు, రెడ్డి శ్రీనివాసచక్రవర్తి, సారిక వెంకటేశ్వరరావు, బండి తులసీరావు, జనసేన నాయకులు వలవల రవితేజ, యడవల్లి వెంకటేష్, చిత్తూరు సురేష్, జంపన అరవింద్ పాల్గొన్నారు



కలిదిండి మండలంలో..

కొయ్యలగూడెం:మండలంలోని బయ్యనగూడెం- సరిపల్లి రోడ్ల దుస్థితిని నిరసిస్తూ టిడిపి, జనసేన పార్టీలు సంయుక్తంగా ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలవరం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి చెర్రీ బాలరాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు న్నరేళ్లు గడిచినా రోడ్లకు కనీసం మరమ్మతులు కూడా చేయలేదన్నారు.

ఏలూరులో ఏర్పాటు చేసిన భారీ ఎల్ఇడి స్క్రీన్

భారీ స్క్రీన్లలో క్రికెట్ వీక్షణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆదివారం జరిగిన ఇండియా, ఆస్ట్రేలియా వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ తిలకించేందుకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఇండోర్ స్టేడియంలో భారీ ఎల్ఇడి స్క్రీన్ ఏర్పాటు చేశారు. సుమారు వెయ్యి మందికిపైగా మధ్యాహ్నం మైదానానికి చేరుకున్నారు. ముఖ్యంగా యువత జాతీయ పతాకాలను చేతబట్టి మైదానంలో సందడి చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వి.శ్రీనివాసరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని 13 జిల్లాల ముఖ్య పట్టణాల్లో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ భారీ స్క్రీన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే పెదవేగి మండలం కొండలరావుపాలెంలో దెందులూరు ఎంఎల్‌ఎ కొఠారు అబ్బయ్య చౌదరి ఆధ్వర్యంలో భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు.

క్రికెట్‌ను వీక్షిస్తున్న ప్రజలు

విద్యారంగ అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తామని, అన్ని సౌకర్యాలతో పాఠశాలలను తీర్చిదిద్దుతామని, వేల కోట్ల రూపాయలు విద్యారంగం కోసం ఖర్చు పెడతామని చెప్పిన ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో ఎంత మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిందో, ఎంతమంది ప్రభుత్వ ఉపాధ్యాయుల నియామకాలు జరిగాయో శ్వేతపత్రం విడుదల చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా యుటిఎఫ్ 49వ కౌన్సిల్ సమావేశం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయరామరాజు అధ్యక్షతన వైఎన్ కళాశాలలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఒక పాఠశాల కూడా మూసివేయలేదని, ఏ ఒక్క ఉపాధ్యాయుడినీ తొలగించలేదని ప్రభుత్వం చెబుతోందని, 4600 పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను విలీనం చేయడం వల్ల నాణ్యమైన విద్య ఎక్కడ అందిందో చెప్పాలని డిమాండ్ చేశారు. 14 వేల ప్రాథమిక పాఠశాలల్లో ఏకోపాధ్యాయులు ఉన్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇక్కడ చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం ఉందా అని ప్రభుత్వమే చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్లు ఇచ్చేశామని ప్రభుత్వం గొప్పగా చెబుతోందని, ప్రతి ప్రమోషన్‌కూ ఎన్ని ఎస్‌జిటి పోస్టులు రద్దు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. పాఠశాలల పర్యవేక్షణ పేరుతో అధికారులు తిరగడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రులకు నమ్మకాన్ని పెంచిందా, తగ్గించిందా అని సమీక్షించుకోకుండా పర్యవేక్షణ పేరుతో విద్యారంగాన్ని బలహీనపర్చడం, ఉపాధ్యాయులను మానసిక వేధింపులకు గురిచేయడం సరికాదని విమర్శించారు. జిఒ 117 వల్ల పాఠశాల విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాలకులు కార్పొరేట్ సంస్థల లాభాల కోసం ఉద్యోగ, ఉపాధ్యాయుల పెన్షన్ రద్దు చేసిందన్నారు. పాలకులు ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షమో లేక కార్పొరేట్ల పక్షమో తేల్చుకోవాలన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా వారంలో సిపిఎస్ రద్దు చేస్తానన్న హామీ నాలుగున్నరేళ్లయినా నెరవేరకపోగా సిపిఎస్ కంటే ఘోరమైన జిపిఎస్ అమలు చేస్తున్నామని ప్రభుత్వం గారడీ చేస్తోందని విమర్శించారు. చట్టం చేసినంత మాత్రాన పోరాటాలు ఆపాల్సిన అవసరం లేదని తెలిపారు. నల్ల చట్టాల రద్దుకు రైతులు చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని సిపిఎస్, జిపిఎస్ రద్దుకు పోరాడాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం పిఆర్‌సి, డిఎ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఎపిజిఎల్ఐ లోన్లు ఫైనల్ సెటిల్‌మెంట్లు క్లియర్ చేయాలని, 12వ పిఆర్‌సికి సంబంధించి ఇంటీరియల్ రిలీఫ్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మాట్లాడారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు పొదిలి కృష్ణమూర్తి, వలవల శ్రీరామ్మూర్తి, సిఐటియు నాయకులు కె.రాజా రామ్మోహన్ రాయ్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.శుభాషిణి, ఏలూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముస్తఫాఅలీ, ఆర్.రవికుమార్, పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.మార్కండేయులు, సహాధ్యక్షులు కె.రాజశేఖర్, సహాధ్యక్షురాలు కె.శ్రీదేవి, జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయాలతోనే గ్రామ స్వరాజ్యం

మంత్రి కారుమూరి

ఉండి:సచివాలయాలతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఉనుదుర్రు గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రారంభించారు. గ్రామ సచివాలయం నూతన భవనాన్ని పరిశీలించి ఎంతమంది సిబ్బంది పనిచేస్తున్నారు, ఏమైనా ఖాళీలు ఉన్నాయా అని మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యమే నేడు గ్రామ సచివాలయాలన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి పాలన చేస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను గత ప్రభుత్వాలలో ఎన్నడూ జరగలేదన్నారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకునేందుకు ఆలోచనలు చేస్తున్నారని అన్నారు. ప్రజలు నాలుగున్నర సంవత్సరాల కాలంలో చేసిన ప్రగతిని గమనించాలన్నారు. లబ్ధిదారులకు పథకాలు అందించే కార్యక్రమంలో సిబ్బంది నిమగ్నమై ఉండాలన్నారు. ఎక్కడా ఒక్క చిన్న ఫిర్యాదు రాకుండా చక్కని సేవలందించి, ఆదర్శ సచివాలయాలుగా తీర్చి దిద్దుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహ రాజు, పంచాయతీరాజ్ డిఇ కె.శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి కె.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి : చిన్నం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఎంఎల్‌ఎగా తనకున్న అనుభవంతో నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడు కృషి చేస్తానని నూజివీడు నియోజకవర్గ మాజీ ఎంఎల్‌ఎ చిన్నం రామకోటయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కనసానపల్లి గ్రామంలో మిత్రులు, శ్రేయోభిలాషులతో ఆయన ఆత్మీయసమావేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నియోజకవర్గ ఎంఎల్‌ఎ బరిలో దిగుతానని, నియోజకవర్గ పరిధిలో గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం పాటుపడతానన్నారు. మండల ప్రజలు తన గెలుపుకు సహకరించాల్సిందిగా కోరారు.


మాట్లాడుతున్న చిన్నం రామకోటయ్య

కాపు సేన రాష్ట్ర మహిళా కార్యదర్శిగా కృష్ణకుమారి

ప్రజాశక్తి - భీమడోలు

కాపు సంక్షేమ సేన రాష్ట్ర మహిళా కార్యదర్శిగా పూతారు గ్రామానికి చెందిన మామిడిపల్లి కృష్ణకుమారి నియమితులయ్యారు. కాపు సంక్షేమ సేన ఎగ్జిక్యూటివ్ కమిటీ తీర్మానం మేరకు నియామకం జరిగినట్లు కాపు సంక్షేమ శాఖ వ్యవస్థాపక అధ్యక్షులు చేగొండి హరిరామ జోగయ్య తెలిపారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన కాపు సంక్షేమ సేన వ్యవస్థాపక అధ్యక్షులకు కృష్ణకుమారి కృతజ్ఞతలు తెలిపారు. కాపు సంక్షేమ సేన ఆదేశాల మేరకు పనిచేస్తానన్నారు. ఆమెను పలువురు అభినందించారు.

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల మద్దతు ధరను పౌర సరఫరా శాఖ ప్రకటించినట్లు మండల వ్యవసాయాధికారి బొర్రా వేణుమాధవ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కామన్ రకం క్వింటాలు ధర రూ.2,183, 75 కేజీల బస్తా రూ.1637, 40 కేజీల బస్తా రూ.873, గ్రేడ్ ఎ రకం క్వింటాలు ధర రూ.2,203, 75 కేజీల బస్తా రూ.1,652, 40 కేజీల బస్తా రూ.881లకు కొనుగోలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. రైతులు ఆర్‌బికేల ద్వారా ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఏమైనా సమస్యలు ఎదురైతే రైతులు టోల్ ఫ్రీ నెంబర్ 1967కు ఫిర్యాదు చేయవచ్చునని ఆయన తెలిపారు. రైతులు దళారులు మాట నమ్మకుండా, పండించిన తమ ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ఆర్‌బికేల్లో మాత్రమే విక్రయించుకోవాలని తెలిపారు.


అవార్డు అందుకుంటున్న రాజ్యలక్ష్మి

డాక్టర్ రాజ్యలక్ష్మికి ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లికి చెందిన న్యూరో సర్జన్ డాక్టర్ రాజ్యలక్ష్మికి న్యూఢిల్లీ కాన్ఫడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ఇండియా సంస్థ అవార్డు దక్కింది. ఉమెన్ ఆన్ వింగ్స్ పేరిట ఈ సంస్థ దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన 118 మంది మహిళలకు ఈ అవార్డులు ఇవ్వగా న్యూరో కేటగిరిలో రాజ్యలక్ష్మి ఎంపికయ్యారు. ఈ అవార్డును ప్రతినిధులు శనివారం రాత్రి విజయవాడలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో రాజలక్ష్మికి అందజేశారు. వైద్యరంగంలో ముఖ్యంగా న్యూరో సర్జరీలో ప్రతిభ కనబరచడం పట్ల సంస్థ ప్రతినిధులు రాజ్యలక్ష్మిని అభినందించారు. రాజ్యలక్ష్మికి అవార్డు వచ్చిన సందర్భంగా ముదినేపల్లి ప్రాంతానికి చెందిన పలువురు డాక్టర్లు హర్షం వ్యక్తం చేశారు.


వెంకటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టిడిపి నేతలు

వెంకటేశ్వరరావు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - చాట్రాయి

పర్వతాపురం గ్రామంలో టిడిపి సీనియర్ కార్యకర్త బొర్రా వెంకటేశ్వర రావు(60) అనారోగ్యంతో ఈనెల 10న మృతి చెందారు. ఆదివారం నూజివీడు నియోజకవర్గ టిడిపి నాయకులు పర్వతనేని గంగాధర్ క్రీశేషులు వెంకటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి తన వంతుగా రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి అధికార ప్రతినిధి మందపాటి బసవ రెడ్డి, మండల మాజీ ఎంపిపి కందుల కృష్ణ, మండల కార్యదర్శి కంచర్ల హనుమంతరావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

వ్యక్తిపై దాడి

ప్రజాశక్తి - భీమడోలు

కురెళ్లగూడెంలో ఇద్దరు వ్యక్తుల మధ్య తలెత్తిన గొడవను సర్దుబాటు చేసే ప్రయత్నం చేసిన మధ్యవర్తిపై దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. భీమడోలు పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన శనగల కిషోర్, సత్తియ్య ట్రాక్టర్‌పై కూలీలుగా పనిచేస్తున్నారు. ఈ నెల 15వ తేదీన సత్తియ్య కాటూరి ప్రసాద్‌ల మధ్య ఒక మోటారు సైకిల్ విషయమై వివాదం తలెత్తింది. దీనిని అక్కడే ఉన్న కిషోర్ సర్దుబాటు చేసే ప్రయత్నం చేశారు. ఈ విషయమై ఆగ్రహించిన ప్రసాద్ ఇంటికి వెళ్లి తన కుమారునితో కలిసి ఇనప రాడ్డుతో తిరిగి వెనుకకు వచ్చి కిషోర్‌పై దాడి చేశారు. ఈ సంఘటనలో గాయపడిన కిషోర్‌ను అతని స్నేహితులు చికిత్స కోసం వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కిషోర్ చేసిన ఫిర్యాదుపై భీమడోలు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. నిందితులైన తండ్రీ కొడుకులిద్దరినీ అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరిచారు. కోర్టు వీరికి రిమాండ్ విధించిందని భీమడోలు ఎస్ఐ చావా సురేష్ తెలిపారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక కొవ్వూరు రోడ్డులోని కొత్తపేట సమీపంలో గడ్డి రవాణా చేస్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. మండలంలోని తిరుమలాపురం నుంచి పేరంపేటకు గడ్డి రవాణా చేస్తుండగా, కొత్త పేట వద్దకు వచ్చేసరికి ట్రాక్టర్ ట్రక్కు పక్క భాగం నుంచి మంటలు చెలరేగాయి. దీనిని గమనించిన డ్రైవర్ వెంటనే చాకచక్యంగా సమీపంలోని ఖాళీ ప్రదేశంలోకి ట్రాక్టర్‌ను తరించాడు. స్థానికులు వెంటనే సమీపంలో ఉన్న అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక వాహనం రాగానే సిబ్బంది మంటలను అదుపు చేశారు. ట్రాక్టర్ ట్రక్కు భాగం, ఇంజిన్ కొంతభాగం మంటలో దగ్ధమైంది. ఆస్థినష్టం సుమారు రూ.4 లక్షలు ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

జీడిమామిడి తోట..


జీడిపిక్కలు..

జీడి మామిడి రైతులకేదీ ప్రోత్సాహం..!

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలు, పోడుభూములలో అధికంగా వేల ఎకరాలలో ఉన్న జీడిమామిడి గిరిజనులకు జీవనాధారం.. రైతులకు రుణాలు కల్పిస్తే ఇతర వ్యక్తులకు కౌలుకి ఇవ్వకుండా, ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా జీడిమామిడి పంటను పండిస్తారు. పంట దిగుబడి ఎక్కువగా ఉన్నా, జీడిమామిడి రైతులు నష్టాలు చూస్తున్నారు. దళారుల చేతుల్లో నట్టేట మునుగుతున్న జీడి మామిడి రైతులకు రైతుల ఉత్పత్తి కంపెనీ లిమిటెడ్ మారుమూల గిరిజన కంపెనీ ఏర్పాటుతో కొంతవరకు దళారులకు అడ్డుకట్ట పడింది. వైఎస్ఆర్ జీవిత సాఫల్య పురస్కారానికి ఎంపికైన సోదేం ముక్కయ్య జీడిమామిడి రైతుల ఉత్పత్తి కంపెనీ లిమిటెడ్ ఏర్పాటు చేసి స్థానిక గిరిజన యువకులకు ఉపాధి కల్పిస్తున్నారు. ప్రభుత్వ గిట్టుబాటు ధర ఏర్పాటు చేసి జీడిమామిడి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం వెంకట్రామన్నగూడెం, డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయం వారిచే వ్యవసాయంలో డ్రోన్స్ వినియోగం, జీడిమామిడి పంట ఉత్పత్తి, పెంపకం, నాణ్యతపై మెలకువలు ఇస్తున్నారు.

మండలంలోని అలివేరు, దొరమామిడి, లంకపాకల, చింతకొండ, గొట్టాలరేవు, రేపల్లి, రేగులపాడు, గడిదబోరు, రంగాపురం, గుబ్బిస మామిడి, కొరసవారి గూడెం, బొడ్డేరు, గవరంపేట, చిన్నచిడిపూడి, పెద్ద జీడిపూడి, బోడిగూడెం, బండార్లగూడెం, గొట్టాలరేవు, గురుగుమిల్లి, వీరమద్దిగూడెం, గుల్లపూడి, నిమ్మలగూడెం, చింతలగూడెం, అంతర్వేదిగూడెం, గుబ్బిస మామిడి, పందిరి మామిడి, కాపవరం, నాగులగూడెం, దాసియ్యపాలెం, సీతప్పగూడెం, ముంజులూరు, పులిరాముడు గూడెం, రాజనగరం, కొవ్వాడ వంటి గిరిజన గ్రామాల్లో 6,249 ఎకరాల్లో జీడిమామిడి పంట పండుతుంది. ఆయా గిరిజన గ్రామాల్లో ఉన్న గిరిజనులు వేసవికాలంలో తమకు ఉన్న జీడిమామిడి తోటలలో కుటుంబసభ్యులు అందరూ కలసి జీడి గింజలు ఏరడానికి వెళతారు. కొంతమంది తమకు ఉన్న జీడి తోటలను కౌలుకి ఇచ్చి ఆదాయం పొందుతున్నారు. వర్షాధారంతో పండే పంట, ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా పండే పంట కాబట్టి ఏజెన్సీలోని ఈ జీడిమామిడి పంటకు మంచి గిరాకి బయట మార్కెట్‌లో ఉంది. బయట మార్కెట్‌లో మంచి రేటు ఉన్నప్పటికీ స్థానికంగా ఉన్న దళారులు సిండికేట్ అయ్యి పంటను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. పంట అధిక ఉత్పత్తి ఉన్నా దళారులు తక్కువ రేటుకు కొనుగోలు చేయడంతో జీడిమామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈవిధమైన దళారుల మోసాన్ని చూసిన సోదేం ముక్కయ్య అనే గిరిజన కుటుంబానికి చెందిన వ్యక్తి మారుముల గ్రామమైన గురుగుమిల్లి గిరిజన గ్రామంలో ఆదివాసి జీడిమామిడి రైతుల ఉత్పత్తి కంపెనీ లిమిటెడ్ ఏర్పాటు చేశారు. ఈ కంపెనీ ఏర్పాటుతో కొంత వరకు దళారులకు అడ్డుకట్ట వేయగలిగారు. పూర్తిగా అయితే దళారీ వ్యవస్థ పోలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసినటువంటి వైఎస్ఆర్ జీవిత సాఫల్య పురస్కారానికి సోదం ముక్కయ్యను ఎంపిక చేసి అవార్డులు ఇవ్వడం జరిగింది. గత అక్టోబర్ 28, 2022న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఈ ప్రాసెసింగ్ యూనిట్‌ని పరిశీలించి అభినందించారు.

జీడి మామిడి రైతులను దళారుల నుంచి కాపాడాలి అంటే జీడిమామిడి పంటకు గిట్టుబాటుధర కల్పించి ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేయాలని రైతులు విన్నవించుకుంటున్నారు. అదేవిధంగా వర్షాధారంతో పండే పంటకు ప్రభుత్వం సాగునీరు కల్పిస్తే ఇంకా దిగుబడి పొంది, రైతులు లాభాలు పొందుతారు. పోడుభూములలో అధికంగా ఉన్న జీడిమామిడి రైతులకు రుణాలు కల్పిస్తే ఇతర వ్యక్తులకు కౌలుకి ఇవ్వరు. జీడిమామిడి పంటకు ప్రభుత్వం నుంచి సహకారం అందుతుంది. కృషి విజ్ఞాన కేంద్రం వెంకట్రామన్నగూడెం, డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయం వారిచే వ్యవసాయంలో డ్రోన్స్ వినియోగం, జీడిమామిడి పంట ఉత్పత్తి, పెంపకం, నాణ్యతపై మెలుకువలు ఇస్తున్నారు. ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా పండుతున్న జీడిమామిడి పంట కాబట్టి మంచి మార్కెట్ చేసుకుంటే రైతులు లాభాలు పొందుతారు.

రైతులకు మెలకువలు ఇస్తున్నాము

బి.సుమలత, వ్యవసాయ అధికారి, బుట్టాయగూడెం

కృషి విజ్ఞాన కేంద్రం వెంకట్రామన్నగూడెం, డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయం వారిచే వ్యవసాయంలో డ్రోన్స్ వినియోగం, జీడిమామిడి పంట ఉత్పత్తి, పెంపకం, నాణ్యతపై మెలుకువలు ఇస్తున్నాము. ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల ద్వారా ఈ జీడిమామిడి పంటకు సంబంధించిన అన్ని రకలా తెగుళ్ల, సస్యరక్షణ చర్యల గురించి రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాము. ఎప్పటికప్పుడు రైతులకు అవసరమైనటువంటి సమాచారాన్ని అందిస్తున్నాము. బుట్టాయగూడెం ఏజెన్సీ ప్రాంతంలో నాణ్యమైన జీడి మామిడి పంట లభిస్తుంది.

దళారుల చేతుల్లో రైతులు నష్టపోతున్నారు

సోదేం ముక్కయ్య, వైఎస్ఆర్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీత

మా గిరిజన ప్రాంతంలో జీడిమామిడిపంట అధికంగానే పండుతుంది. గిరిజన రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని స్థానికంగా ఉన్నటువంటి దళారులు పంటకు తగ్గ ధర చెల్లించకుండా తక్కువ ధరకు జీడిమామిడి కొని రైతులను నష్టపరుస్తున్నారు. ప్రభుత్వం నేరుగా గిట్టుబాటు ధర చెల్లించి కొనుగోలు చేయాలని, రైతులను దళారుల నుంచి కాపాడాలని కోరుతున్నాము. ఆదివాసి జీడిమామిడి రైతుల ఉత్పత్తి కంపెనీ లిమిటెడ్ ద్వారా ఇప్పటికి 60 మంది గిరిజనులు ఉపాధి పొందుతున్నాము. మాకు ప్రభుత్వం నుంచి సహకారం అందితే ఇంకా అభివృద్ధి చెందుతాం.

ఘనంగా ఇందిరా గాంధీ జయంతి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

భారత తొలి మాజీ ప్రధాని, ఉక్కుమహిళ, భారతరత్న ఇందిరాగాంధీ 106వ జయంతి వేడుకలు ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన ఇందిరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ బ్యాంకుల జాతీయకరణ చేసి సామాన్యులను కూడా బ్యాంకుల మెట్లు ఎక్కించిన ఘనత ఇందిరమ్మకే దక్కుతుందని, గరీబీ హటావో నినాదంతో పేదలను అత్యున్నత స్థాయికి తీసుకువెళ్లారని తెలిపారు. దేశం కోసం చివరి రక్తం బొట్టు వరకూ పోరాడతానని ప్రతినబూనిన ఆమె దేశం కోసమే ప్రాణాలు అర్పించారని కార్యకర్తలు, అభిమానులకు ఆయన గుర్తు చేశారు. ఈ జయంతి వేడుకల్లో పిసిసి జనరల్ సెక్రెటరీ గౌతు సత్యేంద్ర, జిల్లా సెక్రెటరీలు గౌడ రంగబాబు, సిటీ జనరల్ సెక్రెటరీ సాదేబాబు ప్రసాద్, ఏలూరు సిటీ ఎస్‌సి సెల్ ప్రెసిడెంట్ నలగట్ల అనీల్ మాణిక్యం, పివిఆర్, సేవాదళ్ సుబ్బారావు, సిటీ కిసాన్ సెల్ ప్రెసిడెంట్ కొమ్మన సాంబశివరావు, సూర్యనారాయణ, బీరమ్ శ్రీధర్, చిన్నబాబు, భూషణం, సతీష్ రాయల తదితర కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

చాట్రాయి గ్రంథాలయంలో..

భీమడోలు: ప్రథమ మహిళా ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఏడుకొండలు ఆధ్వర్యంలో ఆదివారం భీమడోలులో కార్యక్రమాలను నిర్వహించారు. ఇదే క్రమంలో గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా భీమడోలు, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. మహిళలకు, విద్యార్థినులకు పలు కార్యక్రమాలను ప్రత్యేకించారు. దీనిలో భాగంగా ఆటల పోటీలు, చెస్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ, గ్రంథ పాలకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళా సామాజిక కార్యకర్త, రిటైర్ ఉపాధ్యాయులు గుళ్ల నూకరాజమ్మను సత్కరించారు. ఇదేక్రమంలో గుండుగొలను శాఖా గ్రంథాలయంలో గ్రంథ పాలకురాలు జి.నాగమణి ఆధ్వర్యంలో విద్యార్థినులకు మహిళల ప్రాథమిక హక్కులు, విధులు అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. భీమడోలు గ్రంథాలయంలో ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు ఇందిరాగాంధీ సేవలను కొనియాడారు.

కలిదిండి : స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళా పోలీస్ ఎం.తులసీ మారుతీ విద్యార్థులకు దిశా యాప్‌పై అవగాహన కల్పించినట్లు గ్రంథాలయాధికారి జె.రమేష్ తెలిపారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

టి.నరసాపురం: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని విజన్ యుపి స్కూల్ కరస్పాండెంట్ పురం శ్రీనివాస్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం విద్యార్థులకు కుర్చీల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల పట్ల ఆశక్తి పెంచుకోవాలన్నారు. క్రీడల వలన మంచి ఆరోగ్యంతో పాటు బుద్ధి వికాసం పెంపొందించుకోవచ్చునని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఛైర్మన్ నల్లూరి శ్రీనివాసరావు, గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్, విజన్ స్కూల్ ఉపాధ్యాయిని జి.వరలక్ష్మి పాల్గొన్నారు.

టి.నరసాపురంలో..

చాట్రాయి : గ్రంథాలయశాఖ కార్యాలయంలో ఆదివారం ముగ్గుల పోటీలు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు దేశభక్తి గేయాల పోటీ నిర్వహించారు. మ్యూజిక్ టీచర్ టి.నళిని, వివి.ఆర్ శిరీష న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం ఉదయం 10 గంటలకు గ్రంథాలయంలో బహుమతి ప్రధానోత్సవం ఉంటుందని గ్రంథాలయ నిర్వాహకురాలు ఎం.శోభ తెలియజేశారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి మహిళా కానిస్టేబుల్ జె.చంద్రకళ, విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు డి.కృష్ణయ్య, చంటిబాబు పాల్గొనగా లైబ్రేరియన్ బి.మణికంఠ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఏలూరు: మహిళలు తమ నిర్ణయాలను తాము తీసుకునే స్వేచ్ఛను కలిగి ఉండడమే మహిళా సాధికారతకు నిదర్శనమని ప్రెసిడెంట్ ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ ఏలూరు పిఎస్.లక్ష్మీ తెలిపారు. బాలల గ్రంథాలయంలో ఆదివారం ఇందిరాగాంధీ జయంతి పురస్కరించుకుని దిశా చట్టం, మహిళా సాధికారతపై చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులందరూ దిశా యాప్‌ను ఆపద సమయాల్లో వినియోగించుకోవాలన్నారు. సెక్రటరీ ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ ఏలూరు గుడిమెట్ల అచ్యుత మాట్లాడుతూ మన మొదటి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈరోజు మనం మహిళా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఈ


భీమడోలులో రిటైర్ ఉపాధ్యాయినికి సత్కారం

ముదినేపల్లి : ముదినేపల్లి, గురజ శాఖా గ్రంథాలయాల్లో ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎఎస్ఐ వై.పద్మజ దిశా చట్టం దాని ఆవశ్యకతపై విఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లీశ్వరి, రేణుక, గౌతమ్ స్కూల్ ప్రిన్సిపల్ కెవి.సుబ్బారావు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో దిశయాప్‌పై అవగాహన

మండల కేంద్రమైన ముదినేపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మంగినేని బాబ్జి ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్ స్టేషన్ సమీపంలో ఉన్న పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హాస్పిటల్స్‌లోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు గోళ్ల రాజ్ కుమార్, పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆశిబాబు సేవలు ఆదర్శం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

విభిన్న ప్రతిభా వంతులకు కృత్రిమ పరికరాలు అందించడంతో పాటు నడవలేని స్థితిలో ఉన్న అనారోగ్య బాధితులకు వీల్ ఛైర్స్ అందిస్తున్న అగాపే సంస్థ వ్యవస్థాపకులు బిరుదుగడ్ల ఆశిబాబు సేవలు ఆదర్శనీయమని డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం గౌరవ అధ్యక్షులు నేలపోలు ప్రభాకరరావు అన్నారు. ఆదివారం అగాపే, డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ముసునూరుకు చెందిన అనారోగ్య బాధితురాలు జి.ధనలక్ష్మి నడవలేని స్థితిలో ఉందనే విషయాన్ని స్థానిక గ్రీన్లాండ్ సేవా సంస్థ సభ్యులు షరీఫ్ ద్వారా తెలుసుకుని ఆమె అవసరాలకు ఉపయోగపడే విధంగా వీల్ ఛైర్ అందించారు. ఈ సందర్భంగా ఆశిబాబు మాట్లాడుతూ అగాపే స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఇతర సేవా సంస్థల సహకారంతో విభిన్న ప్రతిభావంతులకు, అనారోగ్య బాధితులకు సహకారం అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో రోటరీ క్లబ్ సూచన మేరకు డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం సమక్షంలో వీల్ ఛైర్ అందించామన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు దాసరి నాగరాజు, ఎల్.శ్రీను, నాగరాజు మాస్టారు, తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ పరికరాలు అందిస్తున్న ఆశిబాబు


చెరువును పరిశీలిస్తున్న ఎంపిపి

తాగునీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపాలి

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని మంచినీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపాలని ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు అన్నారు. లంక గ్రామాలైన కొండంగి, మట్టగుంట, మూలలంక, భాస్కరరావు పేట, పెదలంక గ్రామాలలో ఆయా గ్రామ సర్పంచులు అధికారులతో పర్యటించి మంచినీటి చెరువులను నింపే ప్రక్రియను పరిశీలించారు. సిబి కెనాల్ ద్వారా తాగునీరు విడుదల చేయడంతో త్వరితగతిన రక్షిత మంచినీటి చెరువులను నింపే వరకు పర్యవేక్షించాలన్నారు. ఈ పర్యటనలో ఎఎంసి ఉపాధ్యక్షులు పాము రవికుమార్, గద్దె ఆనంద్, మహా దేవ విజయ బాబు పాల్గొన్నారు.

దేవులపల్లిలో ఎంపీ పర్యటన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని దేవులపల్లి గ్రామంలో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు సుడిగాలి పర్యటన చేశారు. ఆదివారం దేవులపల్లికి వచ్చిన ఎంపీ స్థానిక వైసిపి కార్యకర్తలతో రాజకీయ పరిస్థితులు, అభివృద్ధి పనుల తీరుపై మాట్లాడారు. ఈ క్రమంలో స్థానికులు రోడ్ల సమస్యలను ఎంపీ దృష్టికి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెయ్యేరులో కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెయ్యేరులో ఆదివారం కార్తీకమాసం వన సమారాధన ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆంజనేయస్వామి గుడి వద్ద నిర్వహించిన ఈ వన సమారాధనలో పెయ్యేరుతో పాటు ముదినేపల్లి, వడాలి, ఆటోనగర్, పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సమారాధనలో పలువురు గ్రామ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల ఆంజనేయస్వామి, పోతురాజు విగ్రహాల ప్రతిష్ట

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రామానుజాపురంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు సౌజన్యంతో ఏర్పాటు చేసిన 33 అడుగుల స్వామివారి బారీ విగ్రహానికి అర్చకులు మామిళ్ళపల్లి శివానంద ఆచార్యులు పూజలు నిర్వహించారు. అనంతరం వేలాది మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ బాలరాజు హాజరయ్యారు.

కన్నాయిగూడెంలో ఆలయం వద్ద పోతురాజు విగ్రహం గ్రామస్తులు ఏర్పాటు చేశారు. ఎంతో అట్టహాసంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజలు తండోపతండాలుగా హాజరయ్యారు. గరగర నృత్యాలతో తీన్మార్ డప్పులతో విగ్రహ ఆవిష్కరణ చేశారు. అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జి.కొత్తపల్లిలో వీధులమ్మ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకా తిరుమల మండలం జి.కొత్తపల్లి గ్రామంలో వేంచేసియున్న రజకుల ఆరాధ్య దైవం, గ్రామ దేవతైన వీధులమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట, నూతన ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం కన్నుల పండుగగా జరిగింది. సుమారు రూ.13 లక్షల వ్యయంతో రజకులు చెరువు వద్ద ఈ ఆలయ నిర్మాణం రజకులు, గ్రామస్తులు సహకారంతో ఏర్పాటు చేశామని రజక సంఘ ప్రెసిడెంట్ రేవూరి శ్రీను తెలిపారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, నాయుకులు, రజకులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న వీరాంజనేయులు

నారాయణపురంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆదివారం మాజీ ఎంఎల్‌ఎ గన్ని వీరాంజనేయులు పర్యటించారు. ఇంటింటా తిరిగి టిడిపి మేనిఫెస్టోను వివరించారు. అలాగే అధికార పార్టీ అక్రమాలు, అన్యాయాలను వివరించి చంద్రబాబును ముఖ్యమంత్రిని ఎందుకు చేయాలో కరపత్రం ద్వారా ప్రసారం నిర్వహించారు. గ్రామ పార్టీ అధ్యక్షులు సప్పా వీరబాబు, కార్యదర్శి నల్ల ఆనంద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీచ్ వద్ద పర్యాటకుల సందడి

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం బీచ్ వద్ద పర్యాటకుల సందడి ప్రారంభమైంది. కార్తీక మాసం మొదటి ఆదివారం కావడంతో పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు అధిక సంఖ్యలో బీచ్‌కు తరలివచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆహ్లాదంగా గడిపారు. సముద్ర స్నానాలు చేశారు. చిన్నారులు ఇసుక తేనెలపై ఆటలాడుకున్నారు. బంధుమిత్రులతో కలిసి వచ్చి సహపంక్తి భోజనాలు చేశారు. బీచ్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పోలీస్, ఆరోగ్య శాఖ, పంచాయతీ, అగ్నిమాపక శాఖ సిబ్బంది విధులు నిర్వహించారు.